సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం ; 8 ; జూలై ; 2025



సాగునీటి కాలువ కబ్జా

బొతునాయుడుపేటలో సాగునీటి కాలువ కబ్జా చేశారు. అధికారులు మౌనం వహిస్తున్నారు.

- 8లో



చైన్ స్నాచర్లు అరెస్టు

మెళియాపుట్టిలో ఇద్దరు చైన్ స్నాచర్లను అరెస్టు చేశారు. చైన్లు స్వాధీనం చేసుకున్నారు.

- 8లో

14న న్యూఢిల్లీలో అవార్డు అందుకోనున్న కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా జీడిపప్పునకు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ కార్యక్రమంలో భాగంగా పలాస జీడిపప్పునకు 'జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు - 2025' లభించింది. ఈ నెల 14న ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి అవార్డుల ప్రదానోత్సవానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఉద్యాన అధికారి రత్నాల వరప్రసాద్ హాజరై అవార్డును అందుకోనున్నారు.

న్యూస్‌రీల్

బియ్యంలో పురుగుల గుర్తింపు



లఖిదాసుపురం ఉన్నత పాఠశాలలో సన్నబియ్యం పరిశీలిస్తున్న సంతోష్ కుమార్

నందిగాం: జిల్లా సివిల్ సప్లై క్వాలిటీ అధికారి సంతోష్‌కుమార్ మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. నందిగాం, నర్సిపురం, లఖిదాసుపురం పాఠశాలలను ఆయన సోమవారం సందర్శించి బియ్యంలో సుంకు పురుగులు, తెలుపు రంగులో సన్నని పురుగులు ఉన్నట్లు గుర్తించారు.

బియ్యం గోదాము తనిఖీ



నామాల లక్ష్మీపురం బియ్యం గోదాములో తనిఖీలు నిర్వహిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్


బూర్జ: మండలంలో గల సింగన్నపాలేం గ్రామ పంచాయతీ నామాల లక్ష్మీపురం గ్రామం పరిధిలో గల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ అనుబంధ సంస్థ ద్వారా నడుపుతున్న శ్రీసాయి హరి పద్మ లాజిస్టిక్స్ ప్రైవేటు లిమిటెడ్ ఇన్వెస్టర్ గోదామును జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సోమవారం పరిశీలించారు. గోదాములో నిల్వ ఉన్న రైస్, రికార్డులు పరిశీలించారు. పది రోజుల కిందట సరఫరా చేసిన బియ్యంలో ఎలాంటి లోపాలు లేవని తెలిపారు. నామాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన చిక్కాల రంగబాబు అనే దివ్యాంగుడు తన ఇంటికి రేషన్ అందించాలని జేసీకి విన్నవించారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మార్పు దుర్గాపృథ్వీరాజ్ తెలిపారు. అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తలతో యువజన విభాగం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరంతోపాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వైఎస్సార్ అభిమానులు, పార్టీ శ్రేణులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. శ్రీకాకుళంలో రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకు కమ్యూనిటీ హాల్‌లో శిబిరం నిర్వహిస్తామన్నారు.

పురుగుల బియ్యంపై పరుగులు





- 'సాక్షి'లో వరుస కథనాలతో అధికారుల్లో చలనం
- మెగా పేరెంట్స్ టీచర్స్ డేలో ఇష్యూ అవుతుందని అప్రమత్తం
- తనిఖీలపై కీలక ఆదేశాలు జారీ చేసిన జాయింట్ కలెక్టర్
- తనిఖీల్లో కొన్నిచోట్ల బయటపడ్డ పురుగులు
- పాఠశాలలదే తప్పు అంటూ పౌరసరఫరాల సంస్థ అధికారుల వింత స్పందన

పురుగులు రావడానికి పాఠశాలలదే తప్పు అని చెబుతూ పౌరసరఫరాల సంస్థ జారీ చేసిన రిజాయిండర్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్‌లో చదువుతున్న పిల్లల కోసం అందించిన పురుగుల బియ్యంపై అధికారుల్లో కదలిక వచ్చింది. 'సాక్షి' దినపత్రికలో వరుస కథనాలు రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ విషయం చర్చనీయాంశమైంది. పిల్లలకు పెట్టే భోజనంలో పురుగులా అని ఆశ్చర్యపోతున్న పరిస్థితి నెలకొంది. ఈ నెల 10వ తేదీన అట్టహాసంగా నిర్వహించబోతున్న మెగా పేరెంట్స్ టీచర్స్ డేలో ఇదొక పెద్ద ఇష్యూ అవుతుందని యంత్రాంగం అప్రమత్తమైంది. యుద్ధ ప్రాతిపదికన పురుగుల బియ్యం సమస్యను పరిష్కరించడానికి శ్రీకారం చుట్టారు. దానిలో భాగంగా ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు ఒకరు చొప్పున టెక్నికల్ అసిస్టెంట్లను కేటాయించి, వారు పాఠశాలలకు వెళ్లి తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఎక్కడైతే పురుగులు కనిపిస్తాయో అక్కడ బియ్యం బ్యాగులను రీప్లేస్ చేయాలని సూచించారు.

జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి...

మెగా పేరెంట్స్ టీచర్స్ డేను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. దానికోసం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయాలని, రికార్డు సృష్టించాలని అధికారులను ఆదేశించింది. మొన్నటివరకు యోగా డే కోసం ఎలాగైతే యంత్రాంగమంతా రాత్రి పగలనకుండా కష్టపడిందో ఇప్పుడదే విధంగా మెగా పేరెంట్స్ టీచర్స్ డే కోసం కష్టపడుతోంది. ఎలాగైనా రికార్డు సృష్టించాలని ఆరాటపడుతోంది. ఈ సమయంలో పాఠశాలలకు ప్రభుత్వం అందజేసిన సన్నని బియ్యంలో ఎక్కడికక్కడ పురుగులు కనిపిస్తుండటం ఇబ్బందికరంగా మారింది. భోజనాలను పిల్లలు కూడా పడేస్తుండడంతో ఉపాధ్యాయులు సైతం గగ్గోలు పెట్టడమే కాకుండా ఫిర్యాదులు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి.

'సాక్షి' కథనాలతో చర్చ..

పురుగుల బియ్యంపై 'సాక్షి' పత్రికలో వరుస కథనాలు రావడంతో ప్రజల్లో కూడా చర్చకు దారితీసింది. రాష్ట్ర స్థాయిలో సంచలనమైంది. ఉపాధ్యాయులే కాదు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ వైఖరిని దునుమాడుతున్నారు. ఏకంగా అధికారుల గ్రూపుల్లోనే వీడియోలు, ఫొటోలతో సహా పెడుతున్నారు. ఇవన్నీ కథనాల రూపంలో వచ్చినప్పటికీ తొలుత పౌరసరఫరాల అధికారులు తేలిక గా తీసుకున్నారు. వాస్తవం కాదని కొట్టి పారేశారు.

ఫిర్యాదుల వెల్లువ

అయితే పురుగుల బియ్యంపై జిల్లా వ్యాప్తంగా ఫిర్యాదులు రావడంతో పాటు 'సాక్షి' లో వచ్చిన కథనాలు యంత్రాంగాన్ని ఆలోచనలో పడేశాయి. మెగా పేరెంట్స్ టీచర్స్ డే ముందు సమస్యగా మారుతుందని యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన స్పందించక తప్పలేదు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ కాస్త సీరియస్‌గా తీసుకున్నారు. తక్షణమే ఎంఎల్ ఎస్ పాయింట్ల వారీగా తనిఖీలు చేయాలని, పాఠశాలలకు వెళ్లి బియ్యం బ్యాగులను పరిశీలించాలని టెక్నికల్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. జిల్లాలో 14ఎంఎల్‌ఎస్ పాయింట్లు ఉండగా, 14మంది టెక్నికల్ అసిస్టెంట్‌లను నియమించారు. వారికి పాఠశాలలకు సంబంధించిన సమాచారం, ప్రధానోపాధ్యాయుల వివరాలు అందించాలని ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జిలకు ఆదేశించారు. దీంతో టెక్నికల్ అసిస్టెంట్లు రంగంలోకి దిగారు. తనిఖీలు చేసే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. సోమవారం పలుచోట్ల జరిగిన తనిఖీల్లో కూడా పురుగులు కనిపించాయి. కొన్నిచోట్ల మాత్రం జాగ్రత్త పడి మసిపూసే కార్యక్రమం చేయడంతో అంతా ఓకే అనిపించేశారు.

తప్పంతా బడిదేనంట..


మరోవైపు పురుగుల బియ్యం తప్పిదాన్ని ఉపాధ్యాయులపై పౌరసరఫరాల సంస్థ అధికారులు నెట్టేశారు. తప్పు అంతా పాఠశాలలదే తప్ప తమది కాదని తేల్చేశారు. ప్రభుత్వ పాఠశాలలుకు సరఫరా చేసిన బియ్యం బ్యాగులను జాగ్రత్తగా ఉంచకపోవడం వల్లనే పురుగులు వచ్చాయంటూ తప్పించుకుంటున్నారు. సరైన ప్రదేశంలో దాచకపోవడం వల్ల, గాలి చొరబడని సంచుల్లో నిల్వ చేయడం వలన పురుగులు వచ్చాయని పరోక్షంగా ఉపాధ్యాయులను తప్పు పట్టారు. ఇప్పుడిది వివాదస్పదంగా మారింది. బ్యాగు ఇచ్చిందే పౌరసరఫరాల సంస్థ అయితే దాంట్లో ఉపాధ్యాయులకు, పాఠశాలలకు ఏం సంబంధమో వారికే తెలియాలి. కేవలం ఉపాధ్యాయులు, పాఠశాలలను బలి చేసేందుకు ఇలా మాట మార్చేస్తున్నారు.

అధికారుల ముందే..

ఇచ్ఛాపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం బియ్యంలో పురుగులను టెక్నికల్ బృందం సోమవారం గుర్తించింది. జిల్లాలో మధ్యాహ్న భోజనపథకం బియ్యంలో పురుగులు ఉండటంతో జిల్లా అధికారుల ఆదేశాలపై ఎంఎల్‌ఎస్ ఇన్‌చార్జి బి.కిశోర్, పరిశీలకులు రేణుక, సీఎస్‌డీటీ సంతోష్‌లు పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజన పథకం బియ్యాన్ని పరిశీలించారు. బియ్యంలో పురుగులు ఉండటంతో బియ్యం నిల్వ చేసే గదిలోకి వెళ్లి పరిశీలించారు. పాత బియ్యంలో పురుగులు ఉండడంతో కొత్త బియ్యం కూడా పాడయ్యాయని తెలిపారు.



బియ్యంలో పురుగులను గుర్తించిన టెక్నికల్ బృందం



ఆ జ్ఞాపకం చెరగదు..

- జిల్లాలో అడుగడుగునా రాజన్న జ్ఞాపకాలు
- నాటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే జిల్లా ప్రగతికి సోపానాలు
- నేడు వైఎస్సార్ జయంతి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: గలగలా పారుతూ వంశధార ఆయనను గుర్తు చేస్తూ ఉంటుంది. వేలాదిమందిని రక్షిస్తూ రిమ్స్ ఆ పేరును తలచుకుంటూనే ఉంటుంది. కరకట్టల కింద ఉన్న ఊళ్లు ఆయన రూపాన్ని తలచుకుంటూనే ఉంటాయి. బీఆర్‌ఏయూ పరిసరాలు ఆయన వదిలిన గురుతులను గుర్తు చేస్తూనే ఉంటాయి. సిక్కోలులో అడుగడుగునా వైఎస్ రాజశేఖర రెడ్డి జ్ఞాపకాలు ఉన్నాయి. జిల్లాలో మొదలైన ప్రతి కీలక ప్రాజెక్టు ఆయన చలవే. సిక్కోలు నుదుటిపై ఉన్న వెనుకబడిన జిల్లా అన్న ముద్ర చెరపడానికి వైఎస్సార్ చేసిన యజ్ఞం ఓ మధుర జ్ఞాపకంగా సిక్కోలు గుండె గదిలో చిరస్మరణీయంగా ఉంటుంది. నేడు మహానేత వైఎస్సార్ జయంతి.

వైఎస్సార్ జ్ఞాపకాల్లో కొన్ని..

- చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకే విశాఖపట్నానికి పరుగులు తీసే శ్రీకాకుళం జిల్లా ప్రజలకు రిమ్స్‌ను కానుకగా ఇచ్చారు. 300 పడకల జిల్లా కేంద్ర ఆసుపత్రిని 500 పడకలుగా మార్చారు.
- ఎచ్చెర్లలో 2008 జూలై 25న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ ఏర్పాటు చేశారు.
- జిల్లాలో 2.50లక్షల మందికి పైగా రైతులకు రుణమాఫీ చేశారు.
- 2005మే నెలలో వంశధార స్టేజ్ 2, ఫేజ్2 ప్రాజెక్టు పనులను ప్రారంభించారు. 20 మండలాల్లో 2.55లక్షల ఎకరాలకు సాగునీరందించేందుకు తలపెట్టారు.
- జిల్లాలోని హిరమండలం వద్ద సుమారు 10వేల ఎకరాల్లో 19టీఎంసీల నీటి నిల్వకోసం రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు.
- తోటపల్లి ఫేజ్-2 పనుల ఘనత ఆయనకే దక్కుతుంది.
- సాగునీరు, పలాస పట్టణానికి తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.123.25 కోట్లతో ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు.
- వంశధార, నాగావళి నదుల అనుసంధానం పనులకు శ్రీకారం చుట్టారు.
- 12,500 ఎకరాలకు సాగునీటి కోసం మడ్డువలస ప్రాజెక్టు స్టేజ్-1 పనులను రూ.57.87 కోట్లతో చేపట్టారు.
- రూ. 300కోట్లతో కరకట్టల నిర్మాణాలకు సంకల్పించారు.
- సీతంపేట ఏజెన్సీలో 14వేల ఎకరాల్లో 5వేల మంది గిరిజన రైతులకు పట్టాలు ఇచ్చారు.
- పేదలకు స్థలమిచ్చి గూడు నిర్మించిన మొట్టమొదటి సీఎం వైఎస్సారే. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 1,80,817 ఇళ్లు మంజూరు చేసి అందులో 1,63,140 ఇళ్లను పూర్తిచేశారు.
- నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న సంకల్పంతో 2007లో ప్రారంభించిన ఆరోగ్యశ్రీతో వేలాది మందికి జీవం పోశారు. 108 అంబులెన్స్‌లు, 104 వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు.
- పేద విద్యార్థులకు కూడా కార్పొరేట్ చదువులు అందించాలనే ఉద్దేశ్యంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారు.ఈ పథకం ద్వారా లబ్ధిపొందిన వారిలో బీసీ విద్యార్థులే మన జిల్లాలో 72వేలమందికి పైగా ఉన్నారు.

వైఎస్సార్ జయంతి ఘనంగా నిర్వహించాలి

నరసన్నపేట: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని మంగళవారం పార్టీ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన చేశారు. అన్ని నియోజకవర్గాలు, మండలాల్లో జయంతి వేడుకలు చేయాలని, సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పార్టీ ప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బ్లాక్ మెయిల్ దందా ▸ రౌడీషీటర్‌కు ఎమ్మెల్యే అండ!

- తండ్రీ కొడుకులను డబ్బులు కోసం బెదిరించిన కేసులో రౌడీషీటర్‌పై కేసు నమోదు
- అరెస్టు కాకుండా 41 నోటీసుతో వదిలేసేలా చూడాలని ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడిని ఆశ్రయించిన రౌడీ షీటర్
- 41 నోటీసు ఇచ్చి వదిలేయాలని పోలీసులకు ఎమ్మెల్యే ఆదేశం
- ఇవన్నీ రికార్డు చేసిన రౌడీషీటర్ కుంగు ఫు శేఖర్
- బయటకు వచ్చిన ఆడియో క్లిప్పింగ్



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లా కేంద్రంలో ఒక రౌడీ షీటర్‌కు ఎమ్మెల్యే, మరో టీడీపీ నాయకుడు అండగా ఉన్న విషయం వెలుగులోకి వచ్చింది. రూరల్ స్టేషన్‌లో నమోదైన కేసులో అరెస్టు కాకుండా 41 నోటీసు ఇచ్చి వదిలేసేలా ఎమ్మెల్యే సహకరించారు. ఫోన్‌లోనే తతంగమంతా నడిపారు. అటు రౌడీషీటర్‌ను హోల్డ్‌లో పెట్టి ఎమ్మెల్యే పోలీసులతో మాట్లాడారు. తన మనిషి అని, ఎలాగైనా ఆయన్ని అరెస్టు చేయకుండా చూడాలని పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. అవసరమైతే డీఎస్పీతో కూడా మాట్లాడేందుకు సిద్ధమయ్యారు. ఇదంతా ఫోన్‌లో రికార్డు అయింది. రౌడీషీటర్‌తో ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు, మరో కానిస్టేబుల్ మాట్లాడిన మాటలు ఆడియో క్లిప్పింగ్ ద్వారా బయటకు వచ్చాయి. **ఇప్పుడా ఆడియో క్లిప్పింగ్‌లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.**

కేసు ఇది..


రాగోలు జెమ్స్‌లో పనిచేస్తున్న వెంకటేష్ పై అక్కడే పని చేస్తున్న ఓ మహిళ తనను ప్రేమించి, శారీరకంగా వాడుకుని పెళ్లి చేసుకోకుండా మోసం చేశాడని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇదే సమయంలో నగరంలో పీఎన్ కాలనీ సమీపంలో ఉంటున్న రౌడీషీట్ ఉన్న పైల చంద్రశేఖర్ అలియాస్ కుంగ్‌ఫు శేఖర్ జోక్యం చేసుకుని ఆ యువకుడిని, అతడి తండ్రి గోవిందరావును పిలిచి వార్నింగ్ ఇచ్చారు. రూ.లక్షా 50వేలు ఇవ్వాలని లేకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించాడు. వివిధ సెక్షన్ల కింద కేసు పెట్టి బుక్ చేయిస్తానని బెదిరించాడు. అందుకు ఆ యువకుడు, తండ్రి అంగీకరించలేదు. ఇది జరిగిన కొన్ని రోజుల తర్వాత మరోసారి కుంగ్ ఫు శేఖర్ ఫోన్ చేసి బెదిరించాడు. వ్యవహారం సీరియస్‌గా ఉందని, తనకు డబ్బులు ఇవ్వాల్సిందేనని భయపెట్టాడు. చేసేది లేక వెంకటేష్, అతని తల్లి, మరో దగ్గరి బంధువు వచ్చి కుంగ్ ఫు శేఖర్‌కు రూ.లక్షా 50వేలు ఇచ్చారు. కుంగ్ ఫు శేఖర్‌తో పాటు వచ్చిన బొట్ట శంకర్ అనే మరో రౌడీషీటర్ కూడా రూ. 20వేలు అడిగితే ఇచ్చారు. అంతా తీసుకున్నాక కూడా మళ్లీ మరికొంత సొమ్ము కావాలని ఫోన్‌లో డిమాండ్ చేశారు. బెదిరింపులకు సైతం దిగారు. దీన్ని తట్టుకోలేక యువకుడు వెంకటేష్ తండ్రి గోవిందరావు శ్రీకాకుళం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 308(2), 3(5) బీఎన్‌ఎస్ సెక్షన్ల కింద కుంగ్ ఫు శేఖర్, బొట్ట శంకర్‌పైన గత నెల 16న కేసు కూడా నమోదైంది. ఈ కేసులో ఎక్కడ తనను అరెస్టు చేస్తారనే భయంతో ఎలాగైనా అరెస్టు కాకుండా 41నోటీసుతో బయటపడాలని ఒక ఎమ్మెల్యేతోను, ఒక టీడీపీ నాయకుడు వాసుతోను, ఒక కానిస్టేబుల్‌తోను కుంగ్ ఫు శేఖర్ తీవ్ర స్థాయిలో ప్రయత్నించారు. ఆ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు వాసు కూడా సహకరించారు. స్టేషన్ అధికారులతో మాట్లాడి, అరెస్టు లేకుండా 41నోటీసుతో వదిలేసేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారి మధ్య జరిగిన ఫోన్ సంభాషణ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఒక రౌడీషీటర్‌కు ఎమ్మెల్యే అండగా ఉండటమేంటి? ఆయన సన్నిహితుడిగా చెప్పుకునే వాసు కూడా సహకరించడమేంటని? పోలీసులు కూడా అందుకు తగ్గట్టుగా వ్యవహరించడమేంటని చర్చనీయాంశమైంది.

రౌడీషీటర్ కుంగ్ ఫు శేఖర్‌తో ఎమ్మెల్యే ఫోన్ సంభాషణ ఇది




పైల చంద్రశేఖర్ అలియాస్ కుంగ్‌ఫు శేఖర్: 300 క్లాజ్ విత్ 2, క్లాజ్ విత్ 5బిఎన్ఎస్ సెక్షన్ పెట్టారు అంట.
ఎమ్మెల్యే : ఆహా..
కుంగ్ ఫు శేఖర్: ఆ క్లాజ్ అయితే బెయిల్ ఉండదు. ఎన్‌బీడబ్ల్యూ అది.
ఎమ్మెల్యే: అర్రే.. ఉండు నేను ఇప్పుడే మాట్లాడతాను. లైన్‌లో ఉండు..
కుంగ్ ఫు శేఖర్ : అన్నా.. అన్నా..
ఎమ్మెల్యే : (కాల్ హోల్డ్‌లో పెట్టి పోలీసులతో మాట్లాడాక..) హలో
కుంగ్ ఫు శేఖర్ : అన్నా..
ఎమ్మెల్యే : అదేం ప్రాబ్లెమ్ లేదు అంటా.. కొత్త సెక్షన్ మారాయి. అందుకే ఆ సెక్షన్ పెట్టాము అని పోలీసులు చెప్పారు. నేను ఆల్రెడీ మాట్లాడాను. అదేం కాదు అని చెప్పాడు. నేను చెప్పాను నాకు చాలా ఇంపార్టెంట్ (రౌడీషీటర్ నా మనిషి) అని, మళ్లీ ఏదైనా తేడా జరిగితే బాగోదు అని చెప్పా ను. ఇప్పుడే డీఎస్పీతో కూడా మాట్లాడతాను.
కుంగ్ ఫు శేఖర్ : లేదు అనుకుంటే నేను ఏంటిస్పేటరీ తెచ్చుకుంటాను.
ఎమ్మెల్యే : లేదు.. లేదు.. నేను ఇప్పుడే మాట్లాడతాను.
కుంగ్ ఫు శేఖర్ : ఒక్కసారి మాట్లాడు.

రౌడీ షీటర్ కుంగ్ ఫు శేఖర్‌తో వాసు జరిపిన ఫోన్ సంభాషణ ఇది.



కుంగ్ ఫు శేఖర్: చేశావా..
చల్ల వాసు: హా చేశాను.. వచ్చేమను అదేటి అవ్వదు లే.. సాయంత్రం వచ్చిమను అంటున్నాడు..
కుంగ్ ఫు శేఖర్ : ఆ...
చల్ల వాసు : ఆయన సాయంత్రం వచ్చిమన్నారు. నీకు ఏమీ చేయడట. కానీ తరవాత మాత్రం జాగ్రత్తగా ఉండమన్నాడు.
కుంగ్ ఫు శేఖర్ : హ.. హ.. హ..
చల్ల వాసు : స్టేషన్ బెయిల్ ఇస్తామన్నారు..
కుంగ్ ఫు శేఖర్ : ఇప్పుడు పంపనా..
చల్ల వాసు : ఇప్పుడు వద్దు. సాయంత్రం రమ్మన్నాడు. నేను కూడా ఊరులో లేను. వైజాగ్‌లో ఉన్నాను. సాయంత్రం వస్తా
కుంగ్ ఫు శేఖర్ : అలాగ కాదె..
చల్ల వాసు : ఆ సెక్షన్‌లో ఆ క్లాజ్ లన్నీ చెప్పాను నేను పోలీసులకు. మీకు ఎందుకు నేను చేసి పెడతాను కదా అన్నాడు. తర్వాత జా గ్రత్తగా ఉండమను. ఎక్కడా బయటపడవద్దు అని అన్నాడు.. ఏమైనా అ టెండ్ అవుతాడు అని అంటే .. ఇప్పుడు వద్దు సాయంత్రం వచ్చిన తర్వాత నేను చెప్తాను అప్పుడు ఉంచు అని చెప్పాడు.
కుంగ్ ఫు శేఖర్ : అయితే నువ్వు ఈవెనింగ్ ఊరు లోకి వచ్చేస్తావా అన్నా..
చల్ల వాసు : ఇప్పుడు వచ్చేస్తా బయలుదేరి.
కుంగ్ ఫు శేఖర్ : అయితే నువ్వు వచ్చిన తర్వాత వెళ్దామా..
చల్ల వాసు : హా వెళ్దాం.. **కుంగ్ ఫు శేఖర్ :** ఇద్దరం కలిసి వెళ్దామా.. **చల్ల వాసు :** హా వెళ్దాం.. సరే

ఓ పోలీసు కానిస్టేబుల్‌తో కుంగ్ ఫు శేఖర్ జరిపిన ఫోన్ సంభాషణ ఇలా



పోలీసు: ఎఫ్ఐఆర్ ఇండెక్స్ అని ఒకటి ఉంటాది. అది ఎవరికీ ఇవ్వకుండా ఎస్ఐ గారు దాచేస్తారట.
కుంగ్ ఫు శేఖర్ : హ హ..
పోలీసు: ఇంకో దాంట్లో ఫెయిర్ చేయాలి. అది చెయ్యొద్దని చెప్పారట
కుంగ్ ఫు శేఖర్ : అంటే..
పోలీసు : యాక్చువల్‌గా రెండు రికార్డులు మెయింటైన్ చేయాలి. కానీ ఎస్ఐ గారు అందులో ఫెయిర్ చేయొద్దు అని చెప్పారు. నేను చెప్పినప్పుడు చేయండి అని చెప్పారట.
కుంగ్ ఫు శేఖర్ : ఎవరు..? ఎస్ఐ గారా..?
పోలీసు : మొత్తానికి సార్ వద్దని అన్నారట.
కుంగ్ ఫు శేఖర్ : అంటే కేసు పెట్టట్లేదా అన్న.. వద్దని అన్నారా..
పోలీసు : పెట్టకపోవడం కాదు. అది పెట్టిందే కాన్ఫిడెన్షియల్‌గా ఉంచండి. నేను చెప్పినప్పుడు చేద్దురు అని చెప్పారట.
కుంగ్ ఫు శేఖర్ : వినండి .. వినండి.. నేను ఎంక్వయిరీ చేశాను. క్లాస్ 5 నాన్‌బెయిల్‌బుల్, నేనేటి చేశానంటే ఎమ్మెల్యేగారికి ఫోన్ చేశాను. **ఎమ్మెల్యేగారు వెంటనే ఫోన్ చేశారు డైరెక్టుగా ఎస్ఐ గారికి. నేను లైవ్‌లో ఉండగానే చేశారు.** అదేటీ లేదండి. నేను స్టేషన్ బెయిల్ ఇచ్చేస్తాను, కానీ జాగ్రత్తగా ఉండమనండి అని అన్నాడట. చల్ల వాసుకి అలాగే చెప్పారు. ఎమ్మెల్యే గారు, నేను పక్కనున్నప్పుడే మాట్లాడారు. ఏటంటావ్.. నమ్మొచ్చు అంటావా?
పోలీసు : నేను ఒక్కసారి అడుగుతాను. దానికి 41 పోజిబులిటీ ఉందా లేదా అన్నది ..
కుంగ్ ఫు శేఖర్ : దానికైతే 41పాజిబిలిటీ లేదు. కానీ ఎస్ఐ అయితే ఇస్తానంటున్నాడు.
పోలీసు : ఎస్‌హెచ్‌ఓకైతే పవర్స్ ఉంటాయబ్బా. నేను నీకు ఎప్పుడో చెప్పాను.
కుంగ్ ఫు శేఖర్ : అదే నాకు డౌట్ వచ్చి మీకు అడిగాను. ఎందుకంటే అతను మన దగ్గర అబద్ధం ఆడవచ్చు. కానీ ఎమ్మెల్యే దగ్గర, చల్ల వాసు దగ్గర అబద్ధం ఆడరు కదా.. నేను 41 ఇచ్చేస్తానులే. ఎస్పీ గారు అయితే ఇది పెట్టారు కానీ అబ్బాయి ఏం చేయలేదు కదా నేను చూసుకుంటానులే అన్నాడట ఎస్ఐ.
పోలీసు : అయితే ఒకటి చేయొచ్చు.. ఇందులో ఇద్దరు, ముగ్గురు ముద్దాయిలు అనుకో.. నువ్వు మూడోవాడు అనుకో.. నీకు 41 ఇచ్చేయొచ్చు. నాకు తెలిసి ఇన్వెస్టిగేషన్‌లో తీసేస్తాడేమో నీ పేరు. నేను అదే అనుకుంటున్నాను.
కుంగ్ ఫు శేఖర్ : అదే మాట సేమ్ నువ్వు అన్నట్లే చెప్పాడు అన్న లోక్ అదాలత్‌లోనూ, ఎందులోనో తీసేస్తారు అని..
పోలీసు : ఇన్వెస్టిగేషన్ లో ఎలాగంటే.. శేఖర్ అనే వ్యక్తి ఉండటం వాస్త వమే. కానీ ఆయన ఉన్నప్పుడు జరిగిన సిచ్యువేషన్ ఇది. వెళ్లిపోయిన తర్వాత జరి గింది ఇది.. అని పెడతారు. దానివల్ల ఏటవుతుందంటే మిగతావారికి ఆ సెక్షన్లు వర్తిస్తాయి. నీకు వర్తించవు. అలాగా నీకు ఇన్వెస్టిగేషన్‌లో తీయడానికి అవుతది.
కుంగ్ ఫు శేఖర్ : అయితే ఇప్పుడు నాకు స్టేషన్ బెయిల్ ఇచ్చేవచ్చా అన్నా.. 41 పాజిబుల్ అవుతాదా.. **పోలీసు :** నీకు ఒకటి చెప్తాను విను. నీకు ఎప్పుడు రమ్మంటే స్టేషన్‌కి అప్పుడు ఫోన్ చేయించుకుని వెళ్లిపో. **కుంగ్ ఫు శేఖర్ :** ఈరోజు సాయంత్రం రమ్మని చెప్పారట వాసుతోని. వాసు వైజాగ్‌లో ఉన్నాడు. నేనేటి చెప్పానంటే వాసుకి.. నువ్వు వస్తే ఇద్దరం కలిసి వెళ్దాం స్టేషన్‌కి అని చెప్పాను. ఎమ్మెల్యేది, వాసుది ఒక్కసారి విను. విన్న తర్వాత మీకు క్లారిటీ వస్తది.
పోలీసు : ఏది ఏమైనా నువ్వు స్టేషన్‌కి వెళ్లేటప్పుడు ఒకసారి ఎస్ఐకి ఫోన్ చేయించు ఎమ్మెల్యేతోనే.
కుంగ్ ఫు శేఖర్: ఎందుకన్నా చల్లా వాసునే పట్టుకుని వెళ్తాను స్టేషన్‌కి.. **పోలీసు :** వాసా.. ఎవరు??
కుంగ్ ఫు శేఖర్: వాసు.. అన్నయ్య, **మినిస్టర్ గారి బావమరిది. వాళ్ల సిస్టర్‌నే అచ్చెన్నాయుడు గారు పెళ్లి చేసుకున్నారు. ఎమ్మెల్యే రైట్‌హ్యాండ్ చల్లా వాసే కదా అన్న. అతనే ఉంటాడు అన్నిటిలోని.** ఈ ట్రాన్స్‌ఫర్లు, పోస్టింగ్‌లు అన్నీ ఆయనే చూసుకుంటున్నాడు. అందుకే ఆయన్నే పట్టుకెళ్లి పోతు న్న. వస్తాడు మనకు బాగా పరిచయమే కదా. చల్ల వాసు చాలా పెద్ద స్థాయి వ్యక్తన్నా.. మొన్న నేను స్టేషన్‌కి వెళ్లినప్పుడు కూడా ఎస్ఐ గారు నాకు ఏం చెప్పారంటే.. నేను హెల్ప్ చేసిన విషయం వాసు అన్నయ్యకు చెప్పు, వాసు అన్నయ్య నాకు బాగా క్లోజ్, కొంచెం నువ్వు చెప్పు నీకు నేను ఎలా చూశానో అనేది అని ఆయన అన్నాడు. అన్నయ్య ఈ రోజు సాయంత్రం వాసుని స్టేషన్‌కి తీసుకుని బెయిల్ తీసుకుంటాను అన్నయ్య.. ఉంటాను.

క్లుప్తంగా

10న శ్రీకాకుళంలో జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం బలగ హాస్పిటల్ రోడ్ జంక్షన్ వద్ద ఉన్న డీఎల్‌టీసీ/ఐటీఐ పారిశ్రామిక శిక్షణా కేంద్రంలో ఈనెల 10వ తేదీన జాబ్‌మేళా జరగనుందని అసిస్టెంట్ డైరెక్టర్ (శిక్షణ) వై.రామ్మోహనరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ హెటిరో డ్రగ్స్ ఫార్మాసిటికల్ కంపెనీలో వివిధ ఖాళీల భర్తీ కోసం ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిప్లమో మెకానికల్, ఐటీఐ ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ కెమిస్ట్రీ, డిగ్రీ బీఏ, బీకాం, ఏదైనా ఇంటర్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు వేర్వేరు పోస్టులకు అర్హులుగా పేర్కొన్నారు. 2022 నుంచి 2025 మధ్య ఉత్తీర్ణులై 26 ఏళ్లలోపు వయస్సు కలిగినవారు అర్హులని స్పష్టం చేశారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు విద్యార్హత సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌ఫొటోలతో గురువారం ఉదయం 9 గంటలకు డీఎల్‌టీసీ పారిశ్రామిక శిక్షణా కేంద్రం వద్దకు చేరుకోవాలని సూచించారు.

విద్యుత్ వినియోగదారుల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యుత్ వినియోగదారులు

కవిటి: మండలంలోని కపాసుకుద్ది పంచాయతీ కె.కపాసుకుద్దిలో విద్యుత్ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంపై స్థానికులు రాజపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఆరు దశాబ్దాల క్రితం వేసిన విద్యుత్ కండెన్సర్లు, ఇన్సులేటర్లు దారుణమైన స్థితిలో పాడైపోయాయని పేర్కొన్నారు. అనునిత్యం వైర్లు తెగిపడి ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలియజేశారు. సుమారు 350 వరకు వివిధ కేటగిరీ కనెక్షన్లు ఉన్నాయని, అయితే ఈ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ లోడ్ తట్టుకోలేకపోవడంతో లో ఓల్టేజీ సమస్యను అనుభవిస్తున్నామన్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు స్పందించాలని ట్రాన్స్‌కో ఏఈ యు.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. తక్షణమే స్పందించకుంటే భవిష్యత్‌లో జరిగే ప్రాణ, ఆస్తి నష్టాలకు విద్యుత్‌శాఖ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

పరిశోధనలపై దృష్టి సారించాలి



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: వర్సిటీ అధ్యాపకులు పరిశోధనా రంగంపై దృష్టి సారించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కె.ఆర్.రజనీ సూచించారు. పూనేలోని సెంటర్ ఫర్ సోషల్ రీసెర్చ్ అండ్ డవలప్‌మెంట్ సంస్థ ప్రచురించిన 'సౌత్ ఆసియన్ జర్నల్ ఆఫ్ పార్టిసిపేటివ్ డవలప్‌మెంట్' ప్రత్యేక సంచికను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధన, అధ్యయన రంగాల్లో సాధించిన ప్రగతి వర్సిటీ పురోగతికి దోహదపడుతుందని తెలిపారు. యూజీసీ గుర్తింపు పొందిన జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో వారు తమ పరిశోధన పత్రాలను ప్రచురించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ అడ్డయ్య, సెమినార్ కన్వీనర్ డాక్టర్ యు.కావ్యజ్యోత్స్న, వాసవ్య మహిళా మండలి డైరెక్టర్ డాక్టర్ రష్మి, వైసీబీ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

3 కిలోల గంజాయి స్వాధీనం

- ఒడిశాకు చెందిన వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామారావు

పాతపట్నం: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఒడిశా రాష్ట్రం పూరీ జిల్లా చందనపూర్ పోలీసు స్టేషన్ పరిధి గడామృగశిర గ్రామానికి చెందిన రఘునాథ్ జెనా అనే వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నడుకుంటూ వస్తున్న అతడి వద్ద నుంచి 3.345 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సాయంత్రం పాతపట్నం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ వి.రామారావు వివరాలు వెల్లడించారు. రఘునాథ్ జెనా ఒడిశా రాష్ట్రంలోని పూరీ తరలించేందుకు మూడు ప్యాకెట్లలో 3.345 కిలోల గంజాయిని బ్యాగులో పెట్టుకొని ఒడిశా నుంచి పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు నడుచుకుంటూ వస్తున్నాడు. అయితే దీనిపై ఎస్ఐ బి.లావణ్యకు ముందుగానే సమాచారం రావడంతో సోమవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో అతడిని పట్టుకున్నారు. అతడిని విచారించగా ఒడిశా రాష్ట్రంలోని మునిగూడ గ్రామంలో కార్తీక్ అనే గంజాయి వ్యాపారి వద్ద నుంచి 3.345 కిలోల గంజాయిని రూ.15 వేలుకు కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు. రైలులో పూరీ వెళ్లాలనే ప్రయత్నంలో పట్టుబడ్డాడు. గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకోవడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన పాతపట్నం ఎస్ఐ, సిబ్బందిని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అభినందించారు. మీడియా సమావేశంలో పాతపట్నం ఎస్ఐ బి.లావణ్య, ఏఎస్ఐ సింహాచలం, పోలీసులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువ కబ్జా



సాగునీటి కాలువ ఆక్రమించి వేసిన లేఅవుట్

సంతబొమ్మాళి: గ్రామాల్లో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు వేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మండలంలోని హనుమంతు నాయుడుపేట పంచాయతీ పోతునాయుడుపేట సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా సర్వే నంబర్ 182/6లో 0.50 సెంట్లలో అక్రమ లేఅవుట్లు వేశారు.

పంచాయతీ, రెవెన్యూ, సుడా అధికారులు అనుమతి లేకుండా దర్జాగా లేఅవుట్లను వేసి అమ్మకాలను చేస్తున్నారు. అంతటితో ఆగకుండా సాగునీటి కాలువను ఆక్రమించి మట్టి వేసి ఎత్తుచేశారు. అసలే ముంపు ప్రాంతం కావడంతో వర్షాకాలంలో ఈ ప్రాంతమంతా జలమయం అవుతుండేది. ఇప్పుడు రియల్టర్ తన వ్యాపారం కోసం సాగునీటి కాలువను ఆక్రమించి ఎత్తు చేయడంతో వర్షాకాలం కురిసే వర్షాలే కాకుండా, కాలువ ద్వారా ప్రవహించే నీరు ఎటు వెళ్లలేక నిల్వ ఉండిపోతోంది. దీంతో పంట పొలాలు రోజులు తరబడి ముంపు బారిన పడి పంటలు కుళ్లిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ముంపు తప్పదు

సాగునీటి కాలువలో మట్టివేసి ఎత్తు చేయడం వల్ల ముంపు తప్పదు. నీరు నిలిచిపోవడం వల్ల పంట పొలాలు దెబ్బతింటాయి. దీనిపై అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– వి. వాసుదేవరావు, రైతు సంఘం నాయకుడు, సంతబొమ్మాళి

నాలా రిజెక్ట్ చేశాము

సాగునీటి కాలువ ఆక్రమించి లేఅవుట్ వేయడంతో నాలా రిజెక్ట్ చేశాము. సాగునీటి కాలువ ఆక్రమించి మట్టి వేయడంతో తొలగించమని సంబంధిత రియల్టర్‌కు తెలియజేశాం. తొలగించకపోతే నోటీసులను ఇస్తాం.

– హేమసుందర్, తహసీల్దార్, సంతబొమ్మాళి

'ఏఎన్‌ఎంలకు రీ కౌన్సెలింగ్ నిర్వహించాలి'



సూపరింటెండెంట్ ఎదుటే నిరసనకు దిగిన ఏఎన్‌ఎంలు

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖలో ఇటీవల జరిగిన గ్రేడ్-ఏఎన్‌ఎం పోస్టుల బదిలీల కౌన్సెలింగ్‌లో తమకు అన్యాయం జరిగిందని, నిబంధనలకు వ్యతిరేకంగా బదిలీలను చేపట్టారని, వెంటనే రీకౌన్సెలింగ్ చేపట్టాలంటూ ఏఎన్‌ఎంలు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఏకంగా డీఎంహెచ్ఓ కార్యాలయ సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్ ఎదుటనే బైఠాయించి నినాదాలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ జరిగితే..ఇక్కడ మాత్రం జూమ్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించారని, దీనిపై విచారణ చేపడితే అక్రమాలు బయటపడతాయని అన్నారు. ఇలాంటి కీలక సమయంలో డీఎంహెచ్ఓ అనిత సెలవుపై వెళ్లడంపై పలు అనుమానాలను వ్యక్తం చేశారు. ఏఎన్‌ఎంలు నిరసనలో ఉండడంతో పనులన్నీ స్తంభించిపోయాయి.

కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా నిరసన



రాంపురం సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న బాధిత రైతులు

మందస: కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాట కమిటీ కన్వీనర్ కొమర వాసు ఆధ్వర్యంలో సోమవారం రాంపురం సచివాలయం ఎదుట నిరసన తెలియజేశారు. రాంపురం, మీల గంగువాడ, తెలగ గంగువాడ బాధిత రైతులు మాట్లాడుతు తరాతరాలుగా తాము ఈ భూములపై పంటలు పండించి వాటిపై జీవిస్తున్నామని, ఇక్కడ అవసరం లేని ఎయిర్ పోర్టు వంటి నిర్మాణాలు చేపడితే దానికి వ్యతిరేకంగా ఎంత దూరమైనా వెళ్తామన్నారు. తమ ఉద్యమానికి స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష, కేంద్ర పౌర విమాన శాఖమంత్రి రామ్మోహన్‌నాయుడు సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చిత్త గున్నయ్య, పొట్టి ఎర్రయ్య, మర్ల జనార్ధన్, దున్న రామారావు, సురేష్, నూకలమ్మ గున్నమ్మ బాధిత రైతులు, మహిళలు యువకులు పాల్గొన్నారు.

దారి పొడవునా ఇసుక నిల్వలు



బుచ్చిపేట వద్ద జీడి తోటల్లో ఇసుక నిల్వలు



గోపాలపెంట-మడపాంల మధ్య వంశధార నదిలో వేసిన ఇసుక పోగులు

నరసన్నపేట: మండలంలో వంశధార నది పొడవునా ఇసుకాసురులు రాజ్యమేలుతున్నారు. ఇసుక నిల్వలు పెద్ద ఎత్తున నదీ పరిసర గ్రామాల్లో వేశారు. వర్షాకాలంలో నదిలో నీరు వస్తే అమ్మకాలు చేసుకునేందుకు వీలుగా ఎక్కడికక్కడ ఇసుక పోగులు కొన్ని వేల క్యూబిక్ మీటర్లు వేశారు. బుచ్చిపేట వద్ద అధికారికంగా డంపింగ్ యార్డు నిర్వహిస్తుండగా దాన్ని తలదన్నే విధంగా లారీ, ట్రాక్టర్ ఓనర్లు కూడా ఇసుక పోగులు దాడి పొడవునా వేశారు. మడపాం నుంచి బుచ్చిపేటకు వెళ్లే మార్గంలో అడుగడుగునా ఇసుక నిల్వలు ఉన్నాయి. అలాగే లుకలాం, అంబోజీపేట, చేనులవలస, గోపాలపెంట తదితర గ్రామాల్లో కూడా ఇసుక నిల్వలు ఉన్నాయి. ఉచితంగా నది నుంచి తవ్వి అధిక ధరలకు అమ్ముకునేందుకు ఈ విధంగా పోగులు వేసినట్లు తెలుస్తోంది. బుచ్చిపేట రోడ్డుకు ఆనుకుని జీడి తోటల్లో కూడా అధికంగా నిల్వలు ఉన్నాయి. వీటిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం నియామకం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కమిటీని నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం తాడేపల్లి నుంచి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఉపాధ్యక్షులు	నియోజకవర్గం
మామిడి నరసింహమూర్తి	పలాస
పరపతి శ్రీనివాసరావు	టెక్కలి

ప్రధాన కార్యదర్శులు	నియోజకవర్గం
కల్ల మదన్	ఇచ్ఛాపురం
మడియా రామకృష్ణ	పలాస
పేరాడ రమేష్‌బాబు	టెక్కలి
తాడేల రామరాజు	పాతపట్నం
కణితి సత్తిబాబు	నరసన్నపేట
వజ్జ వెంకటప్పలనాయుడు	శ్రీకాకుళం
బమ్మిడి అచ్చుతరావు	ఆమదాలవలస
కొత్తకోట సూర్యారావు	ఎచ్చెర్ల

కార్యదర్శులు	నియోజకవర్గం
బొండాడ మహేష్	ఇచ్ఛాపురం
కర్ని శ్రీను	పలాస
కింతల శేషగిరి	టెక్కలి
పొట్నూరు సింహాచలం	పాతపట్నం
పాగోటి గోవింద	నరసన్నపేట
ఉర్దాన శివకుమార్	శ్రీకాకుళం
బండి మహేష్‌కుమార్	ఆమదాలవలస
కిల్లారి మధు	ఎచ్చెర్ల
సార రవికుమార్	పలాస
దాలి లోకేష్‌రెడ్డి	టెక్కలి
మడ్డి రామప్పడు	పాతపట్నం
పొన్నాన మాధవరావు	శ్రీకాకుళం
చింతాడ యతీంద్ర	ఆమదాలవలస

ఎగ్జిక్యూటివ్ మెంబర్లు	నియోజకవర్గం
దుబ్బ రామారావు	ఇచ్ఛాపురం
రాపాక సాగర్	పలాస
రామపాత్రుని శివకుమార్‌రెడ్డి	టెక్కలి
భోగాపురపు నరేష్	పాతపట్నం
పొట్నూరు బద్రినారాయణ	నరసన్నపేట
ఆరంగి సూర్య	శ్రీకాకుళం
బస్వా అనంతలింగరాజ్	ఆమదాలవలస
చందక వెంకటరామారావు	ఎచ్చెర్ల
దున్న అశోక్‌కుమార్	ఇచ్ఛాపురం
మామిడి గోవిందరావు	పలాస
దుప్పల శ్రీనివాసరావు	టెక్కలి
పిన్నింటి ఫల్గుణ	పాతపట్నం
కొబగాపు ఉదయగిరి	నరసన్నపేట
మట్ట నగేష్	శ్రీకాకుళం
బాలి అప్పలసూరి	ఎచ్చెర్ల
చీకటి భూషరాజు	ఇచ్ఛాపురం
కోరాడ సంతోష్	శ్రీకాకుళం
తోట అప్పన్న	ఎచ్చెర్ల
మచ్చ సిద్దార్థ	ఆమదాలవలస
పిసిని చిన్నంనాయుడు	ఎచ్చెర్ల
సురవరపు తిరుపతిరావు	ఆమదాలవలస

ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వరా..?


- సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీపై రాష్ట్ర అధికారుల ఆగ్రహం

శ్రీకాకుళం: జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు రాష్ట్రస్థాయికి చెందిన ఉన్నతాధికారులకు ఎటువంటి సమాచారాన్ని అందించడం లేదని ఎస్పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సమగ్ర శిక్ష ఏపీసీలతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు దీనిలో భాగంగా ఈనెల 10వ తేదీన జరగనున్న తల్లిదండ్రుల సమావేశానికి సంబంధించిన విషయాలపై చర్చించారు. అయితే శ్రీకాకుళం జిల్లాలోని ఆరు మండలాలకు యూనిఫాంలు, బూట్లు రాలేదని ఏపీసీ చెప్పగా, ఇప్పటివరకు రాష్ట్రస్థాయికి ఎందుకు చెప్పలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెగా పేరెంట్స్ డే జరగాల్సి ఉన్నా ఇంత నిర్లక్ష్యంగా ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. సమావేశం రోజు తల్లిదండ్రులు ఆరోపిస్తే రాష్ట్ర అధికారులు, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, అయినా తనకేమీ పట్టనట్లు వ్యవహరించడమేంటని ఏపీసీని నిలదీసినట్లు బోగట్ట.

చివరి స్థానంలో శ్రీకాకుళం

రాష్ట్రంలో ప్రాజెక్టుల వారీగా పరిశీలిస్తే శ్రీకాకుళం జిల్లా చట్టచివర స్థానమైన 26లో ఉంటుందని ఎస్పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులో అత్యంత కీలకమైన ఐదు సెక్టోరియల్ పోస్టులు రెండు నెలలకు పైబడి ఖాళీగా ఉంటే నోటిఫికేషన్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సెక్టోరియల్ అధికారులు లేకుండా పర్యవేక్షణ ఎలా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటిఫికేషన్ ఇవ్వకుండా ఒక్కొక్కరినీ రాజకీయ నాయకుల వద్దకు తీసుకు వెళ్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఇటువంటి విధానాలు మానుకొని తక్షణం నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆదేశించారు. ఇదిలా ఉంటే సీఎంవో పోస్టుకు ఒక హెచ్‌ఎంను సిఫార్సు లేఖతో రాష్ట్రస్థాయికి పంపించడంతోనే ఎస్పీడీ ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. సదరు హెచ్‌ఎం ఏపీసీ బంధువుల గ్రామంలో ఉండడం వలన ఆయనను సీఎంవోగా నియమించేందుకు ఏపీసీ అత్యుత్సాహాన్ని ప్రదర్శించారని ఇప్పటికే ఆగ్రహంతో ఉండగా, జిల్లాలోని ఆరు మండలాలకు కిట్లు రాలేదని సమావేశంలో చెప్పడంతో మరింత ఆగ్రహానికి కారణమైనట్లు తెలియవచ్చింది. ఈ విషయాలను ఏపీసీ శశిభూషణ్ వద్ద సాక్షి ప్రస్తావించగా తానే ఆరు మండలాలకు యూనిఫాంలు, బూట్లు రాలేదని ఎప్పుడు పంపిస్తారని అడిగానని చెప్పారు. తనపై ఎవరూ ఆగ్రహం వ్యక్తం చేయలేదని పేర్కొన్నారు. సీఎంవోగా నియమితుడైన హెచ్‌ఎం తన బంధువు కాదని స్పష్టం చేశారు.

10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 10వ తేదీన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మొదటి, రెండవ సంవత్సరాలకు సంబంధించి విద్యార్థులు, తల్లిదండ్రులు సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు విద్యకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా సమావేశంలో తెలియజేసుకోవచ్చన్నారు. ఏక్ పేడ్ మాకీ నామ్ కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ నుంచి మొక్కలు సరఫరా చేస్తామని, విద్యాలయాల ఆవరణలో నాటాలని పిలుపునిచ్చారు. మధ్యాహ్న భోజనం కూడా కలిసి చేయాలన్నారు.

శ్రీకాకుళం రెడ్ క్రాస్ సొసైటీకి అవార్డు

శ్రీకాకుళం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అవార్డు వచ్చినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. మన జిల్లాకు అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం రైల్వేస్టేషన్ వద్ద కుమ్మరిపేటకు చెందిన దువ్వారపు మల్లేసు (70) రైలు ఢీకొని మృతి చెందాడు. సోమవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. ఆమదాలవలస రైల్వే పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- మీకోసంలో 60 అర్జీల స్వీకరణ



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అర్జీలు పెండింగ్‌లో లేకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక(మీకోసం)లో అర్జీదారుల నుంచి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. ఒక సమయంలో అర్జీలు ఇచ్చేందుకు ఫిర్యాదుదారులు గుమిగూడడంతో కలెక్టర్ చొరవ తీసుకొని, ఆయనే స్వయంగా వెళ్లి వారిని క్యూలో పెట్టారు. అర్జీదారులు గుంపులుగా రావడం వలన వారు చెప్పే విషయం తెలియడం లేదని, అందరూ సంయమనం పాటించాలని కోరారు. దీనిలో భాగంగా రెవెన్యూ, పంచాయతీ రాజ్, డ్వామా, మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ, సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా వైద్యారోగ్య శాఖ, జిల్లా విద్యాశాఖ, డీసీహెచ్ఎస్, ఏపీఈపీడీసీఎల్, గృహ నిర్మాణ శాఖ, సర్వే అండ్ లాండ్ రికార్డులు, వ్యవసాయం, దేవదాయ, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల సమస్యలపై 60 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పద్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, జెడ్పీ సీఈవో ఎల్ఎన్ వి.శ్రీధర్ రాజ తదితరులు ఉన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కొన్ని వినతులు పరిశీలిస్తే...

- పాతపట్నం మండలం యాగంటి అప్పన్నమ్మ వారసులు తనను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల కూడా రాసి ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారని వాపోయారు. తనకు తన ఆస్తిని అమ్ముకోనే విధంగా, తన ఆరోగ్యం బాగులేనందున వైద్యం చేయించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.
- ఎయిడ్స్ కంట్రోల్ విభాగంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు గతంలో తొలగించబడిన నాగభూషణరావుని తిరిగి విధుల్లోకి తీసుకోవద్దని కోరారు.
- ఎచ్చెర్ల మండలం బడివానిపేట గ్రామ పంచాయతీ జాలారి కొయ్యాం, బడివానిపేట గ్రామ పంచాయతీల్లో గల సర్వే నంబర్లు 341, 342, 430, 431, 437లోని భూముల్లో సాగులో ఉన్నవారికి పట్టాలు మంజూరు చేయాలని మత్స్యకారులు కోరారు.





అర్జీదారులను క్యూలో నిలబెడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

ఎస్పీ గ్రీవెన్స్‌కు 72 ఫిర్యాదులు




అర్జీదారుల వద్దకు వెళ్లి మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ మరియు పరిష్కార వేదిక (గ్రీవెన్సు)కు ప్రజల నుంచి 72 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అర్జీలను స్వీకరించి, ఆవరణలో ఉన్న వృద్ధులు, దివ్యాంగుల వద్దకు నేరుగా వెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

చైన్‌స్నాచర్లు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామారావు, ఎస్ఐ రమేష్ బాబు



స్వాధీనం చేసుకున్న బంగారం గొలుసులు

మెళియాపుట్టి: పలు కేసుల్లో నిందితులైన ఇద్దరు వ్యక్తులను మెళియాపుట్టి పోలీసులు జోడూరు గ్రామం వద్ద అరెస్టు చేశారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో పాతపట్నం సీఐ రామారావు, ఎస్ఐ రమేష్ బాబు సోమవారం మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఇటీవల మండలంలో శేఖరాపురం గ్రామంలోని పంట పొలాల్లో నక్క శకుంతలమ్మ అనే మహిళ మెడలోని పుస్తెల తాడులో సగాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తెంపుకొని పారిపోయారు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే సోమవారం ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా బరంపూర్‌కు చెందిన బాలకృష్ణ సాహు, సుజీత్‌కుమార్ పాడిలు మెళియాపుట్టి వస్తుండగా గమనించిన పోలీసులు జోడూరు వద్ద అనుమానంతో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో వీరు ఇదివరకే పలు దొంగతనాల్లో అరెస్టైనట్లు గుర్తించడంతో అరెస్టు చేసి విచారణ చేపట్టారు. ఈ క్రమంలో వీరు జూన్ 29వ తేదీన బరంపురంలో ద్విచక్ర వాహనాన్ని దొంగలించడంతో పాటు శేఖరాపురం గ్రామంలోని నక్క శకుంతలమ్మ పుస్తెల తాడు తెంపినట్లు వివరాలు రాబట్టారు. అలాగే 2024 జనవరిలో మండలంలోని జగన్నాథపురంలో వట్టికుల్ల రాజేశ్వరి మెడలోని తులమున్నర బంగారాన్ని సైతం అపహరించుకుపోయినట్లు తెలుసుకున్నారు. దీంతో వారు దొంగిలించిన బంగారం, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీరిని శ్రీకాకుళం జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు.


బొరిగివలసలో విషాదం



గురన్న (ఫైల్)

నరసన్నపేట: మండలంలోని బొరిగివలసలో విషాదం అలుముకుంది. అనకాపల్లి జిల్లాలో తలుపులమ్మ తల్లికి మొక్కులు తీర్చుకునేందుకు గ్రామస్తులతో కలిసి వెళ్లిన రాజాపు గురన్న (64) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కశింకోట మండలం భయ్యవరం వద్ద వాహనం నిలిపి జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా మరో వాహనం అతివేగంగా వచ్చి ఢీకొంది. దీంతో గురన్న అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని ఇచ్ఛాపురం వద్ద పోలీసులు గుర్తించారు. సోమవారం మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా గురన్నకు భార్య వడ్డేమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పిల్లలకు వివాహాలు కాగా, మృతుడు తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురన్న మృతికి పొందర కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజాపు అప్పన్న, బొరిగివలస ఎంపీటీసీ బుగ్గ జగదీశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బగ్గు రమణయ్యలు సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యాచకుడి దుర్మరణం



యాచకుడి మృతదేహం

ఇచ్ఛాపురం: రోడ్డు ప్రమాదంలో యాచకుడు మృతి చెందాడని పట్టణ పోలీసులు తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో జాతీయ రహదారి-16పై చిత్తూరు నుంచి బరంపురం నగరానికి టమాటా లోడ్‌తో లారీ వెళ్తోంది. అదే సమయంలో బెల్లుపడ టోల్‌ప్లాజా సమీపంలో సాహు అనే యాచకుడు రోడ్‌పై నడుచుకుని వెళ్తుండగా అతడిని తప్పించబోయి లారీ ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ఘటనలో యాచకుడు మృతి చెందగా, లారీ డ్రైవర్ కూడా గాయాలపాలయ్యాడు. వీఆర్వో నర్తు కృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.